క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వసంతలక్ష్మి తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో జరుగనున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్ సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదర్షాకోట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్‌నగర్, బృందావన్ కాలనీ, నర్సారెడ్డి కాలనీ, పద్మశ్రీహిల్స్, పావనీ హార్మోనీ, పావనీ పటల్స్, తిరుమల గార్డెన్, బండ్లగూడ గ్రామం తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు. మరమ్మత్తుల కారణంగా ఈ కోతలు విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

మిలట్రీ–2 ఫీడర్‌లో...

మిలట్రీ–2 ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ ఏ,బీ,సీ,డీ, స్పెషల్ బ్లాక్, కీర్తి రిచ్‌మండ్ విల్లాస్, విద్యానగర్, వీకర్‌సెక్షన్ కాలనీ, హైదర్షాకోట్ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు.

రేపు కేన్సర్ ఉచిత పరీక్షా శిబిరం

మణికొండ: మహిళలకు వస్తున్న రొమ్ము క్యాన్సర్ నివారణకు ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్క్రీనింగ్ శిబిరాన్ని ఏర్పాటు చేశామని టౌన్‌షిప్ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. సికింద్రాబాద్‌లోని రెనోవా సౌమ్య కేన్సర్ ఆసుపత్రి డాక్టర్లు ఇందులో పాల్గొంటారని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పంట నమోదు పక్కాగా చేపట్టాలి



పంటల సాగు నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

శంషాబాద్ రూరల్: రైతులు సాగు చేసిన పంటల నమోదును పక్కాగా చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో చేపడుతున్న పంటల నమోదు ప్రక్రియను శుక్రవారం ఆమె పరిశీలించారు. మదన్‌పల్లిలో 20 మంది రైతులు వివిధ సర్వే నంబర్లలో సాగు చేస్తున్న పలు రకాల పంటల వివరాలు నమోదు చేపట్టారు. సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు ఆమె చర్చించారు. సీజన్ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ కవిత, ఏఈఓ రాఘవేందర్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే ప్రయాణం ఎలా...?

ప్రధాన రహదారిలోనే పొంగిపొర్లుతున్న డ్రైనేజీ



ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి కింద పొంగిపొర్లుతున్న డ్రైనేజీలో ఇబ్బందికరంగా ప్రయాణిస్తున్న వాహనదారులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రధాన రహదారులపై పొంగిపొర్లుతున్న మురుగునీటి కారణంగా వాహనాదారులు, ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. తరచూ ప్రమాదాల బారిన పడుతూ ముప్పుతిప్పలు పడుతున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి కింద డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరుకుంది. గత కొన్ని రోజులుగా డ్రైనేజీ నీరంతా ప్రధాన రహదారిపై పొంగిపొర్లుతుంది. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు, వాహనాదారులు వాపోతున్నారు.

శిథిలావస్థకు చేరిన డ్రైనేజీ వ్యవస్థ...

- డ్రైనేజీ పైపులైన్‌లు వేసి సంవత్సరాలు గడిచిపోవడంతో అవి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి స్థానంలో కొత్త డ్రైనేజీ వ్యవస్థను వేసి ఆధునీకరిస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కరం దొరుకుతుందని స్థానికులు వెల్లడిస్తున్నారు.

ట్రాఫిక్ జామ్...

- మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఆరాంఘర్, శంషాబాద్, మెహిదీపట్నం, రాజేంద్రనగర్‌కు వెళ్లేందు వాహనాదారులతో ఈ రహదారి ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. గత కొన్ని రోజులుగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీ కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. డ్రైనేజీ కారణంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో వాహనాదారులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు, వాహనాదారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

తరచూ ప్రమాదాలు...

- డ్రైనేజీ పొంగిపొర్లుతుండడంతో పాటు ఈ రహదారి సైతం గోతులమయంగా ఉంది. దీంతో వాహనాదారులు గుంతల్లో డ్రైనేజీ నీరు నిలిచిపోవడంతో చూసుకోలేకపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనాదారులు స్కిడ్ అయి కిందపడిపోతున్నార. వారంలో 5–8 ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులకు ఈ విషయమై సమస్యను పరిష్కరించాలని కోరిన తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

యోగా షెడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ

శంషాబాద్: పట్టణంలోని ఏడో వార్డులోని యునానీ ఆస్పత్రి పక్కన యోగా షెడ్డు నిర్మాణ పనులను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ ప్రారంభించారు. పట్టణ ప్రజలందరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపేందుకు యోగా కేంద్రం ఉపయోగపడుతుందన్నారు కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భోగీశ్వరు, కౌన్సిలర్ నాజియా తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



రాజేంద్రనగర్: పరీక్షా పే చర్చా కార్యక్రమంలో నియోజకవర్గంలోని విద్యార్థులను భాగస్వాములను చేయాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా పరీక్షా పే చర్చా కన్వీనర్ ఉమకైలాష్కర్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వివిధ కళాశాలల ప్రిన్సిపల్‌లతో సమావేశమయ్యారు. ఈ నెల 27వ తేదీన జరిగే పరీక్షా పేర్చ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా వై.శ్రీధర్ మాట్లాడుతూ గత 2018 సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

బీఆర్ఎస్‌నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

మణికొండ: బీఆర్ఎస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ విష్ణువర్దన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ శుక్రవారం నార్సింగిలో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మెన్ డి.వెంకటేశ్‌గౌడ్, వైస్ చైర్మెన్ ఎం.ప్రవీణ్‌యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



స్రవంతి (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: కళాశాలకు వెళ్తున్నాని వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మధుబన్ కాలనీకి చెందిన మల్లికార్జున్ కూతురు స్రవంతి(19) స్థానిక కళాశాలలో చదువుకుంటుంది. ఈ నెల 18న కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన యువతి తిరిగి రాలేదు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చూట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేశారు. అయినా ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేవంత్‌రెడ్డికి వినతి

చార్మినార్: పాతబస్తీలో పాదయాత్ర నిర్వహించి ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరముందని.. అదే విధంగా పాతబస్తీలో మెట్రో రైలు పనుల ప్రారంభం కోసం ఆందోళన చేయాల్సిన అసరముందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశామని పాతబస్తీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మీర్ హైదర్ జాఫ్రీ, హాజీ మహ్మద్ మూసా ఖాసింలు తెలిపారు. రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళతా



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న రాజేంద్రనగర్ నియోజకవర్గ మజ్లిస్ పార్టీ ఇన్‌చార్జీ రహమత్‌బేగ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ హనుమాన్ నగర్ బస్తీలో మౌలిక వసతుల విషయమై హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించనున్నట్లు రాజేంద్రనగర్ నియోజకవర్గ మజ్లిస్ పార్టీ ఇన్‌చార్జీ రహమత్‌బేగ్ వెల్లడించారు. శుక్రవారం డివిజన్ మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ ఆధ్వర్యంలో హనుమాన్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, వీధి దీపాలు, పక్కా ఇంటి నిర్మాణ అనుమతులు తదితర సమస్యలను వివరించారు. అనంతరం రహమత్‌బేగ్ విలేకరులతో మాట్లాడుతూ బస్తీ ఏర్పడి మూడు దశాబ్దాలు అవుతున్నా బస్తీలోని సమస్యలను పరిష్కరించకపోవడం దారుణమన్నారు. గ్రేటర్‌లో ఉన్నప్పటికి మౌలిక వసతులు లేకపోవడం దురదృష్టకరమన్నారు. బస్తీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు అసదుద్దీన్ ఒవైసి దృష్టికి తీసుకువెళతానన్నారు. సంబంధిత శాఖ అధికారులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని వెల్లడించారు. ఈ పర్యటనలో నవాజ్, దశరథ్, వెంకటయ్యతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

నిధులెన్ని కావాలో చెప్పండి

ప్రజాప్రతినిధులు, అధికారులకు నకిలీ అధికారి ఫోన్

శంషాబాద్: నేను ఎంఏయూడీ (మున్సిపల్ అర్బన్ డెవలప్‌ఎంట్ అథారిటీ) నుంచి ఫోన్ చేస్తున్నా.. మీ వద్ద ఉన్న కౌన్సిలర్లు ఎంతమంది..? ఎన్ని నిధులు కావాలి..? త్వరగా చెప్పండి.. లేకపోతే నిధులు వెనక్కి వెళ్లిపోతాయి.. అంటూ ఓ నకిలీ అధికారి చేస్తున్న ఫోన్‌కాల్స్ మున్సిపల్ శాఖలో ఇప్పుడు చర్చనీయాంశగా మారింది. మూడురోజుల క్రితం శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌తో పాటు మరికొన్ని మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులతో సైతం ఇదే విధంగా నిధుల విషయం మాట్లాడి డబ్బు తీసుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ ఉన్నతాధికారితో సైతం ఇదే విధంగా సంభాషించినట్లు గుర్తించారు. సదరు వ్యక్తికి తిరిగి ఫోన్ కాల్‌చేస్తే సార్ సచివాలయంలో ముఖ్యమంత్రికి సంబంధించిన ఖమ్మం కార్యక్రమంలో బీజీగా ఉన్నాడంటూ మరో వ్యక్తి సమాధానం కూడా ఇచ్చాడు. సదరు వ్యక్తి సంభాషణ తీరును అనుమానించిన శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ మున్సిపల్ శాఖలో ఆరాతీయడంతో పాటు అతడు నకిలీ అధికారిగా గుర్తించి ఆర్‌జీఐఏ పోలీసులకు మౌఖికంగా ఫిర్యాదు చేశారు. మిగతా కొన్ని మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు, కొందరు అధికారులు కూడా ఈ విషయాన్ని మున్సిపల్ శాఖ దృష్టికి తీసుకెళ్లడంతో అప్రమత్తమైన అధికారులు ఎంఏయూడీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్ అన్న పేరుతో నకిలీ అధికారి ఫోన్ చేస్తున్నాడని.. దీనిని ఎవరు నమ్మకూడదంటు వాట్సాప్ గ్రూప్‌లలో అలర్ట్ చేశారు. అయితే ఇప్పటికే ఇతని బారిన ఎవరైనా పడ్డారా..? లేదా అన్నది అతడు చిక్కితే కాని తెలియని పరిస్థితి నెలకొంది.

'కంటి వెలుగు'తో ఎంతో మేలు

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ప్రస్తుతం మనం తీసుకుంటున్న ఆహారంతో అనేక మందికి కంటి సమస్యలు వస్తున్నాయని, వాటిని నివారించి ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో చేపట్టిన కంటి వెలుగు పథకంతో ఎంతో మందికి మేలు జరుగుతుందని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించి డాక్టర్‌లు, రోగులతో ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు అవసరమైన అన్ని పథకాలను ప్రవేశపెట్టి అందరి మేలును ఆకాంక్షిస్తున్న ప్రభుత్వం బీఆర్ఎస్‌దే అన్నారు. వార్డులలో ఉన్న ప్రతి ఒక్కరికీ కంటివెలుగు పథకం గురించి చెప్పి పరీక్షలు నిర్వహించుకుని లబ్ధి పొందేలా స్థానిక కౌన్సిలర్‌లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖ యాదగిరి, వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్‌యాదవ్, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సృజన, మండల వైద్యాధికారి డాక్టర్ పద్మ, కౌన్సిలర్‌లు ఆర్. ఆదిత్యరెడ్డి, జి.శివారెడిమ మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆర్. నర్సింహాలతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కంటి వెలుగు కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

కంటి వెలుగు శిబిరాలను పరిశీలించిన ఎమ్మెల్యే

శంషాబాద్ రూరల్: మండలంలోని రషీద్‌గూడ, చౌదరిగూడలో కొనసాగుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన గ్రామస్తులతో మాట్లాడారు. అంధత్వ నివారణ కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పరీక్షలు చేయించుకున్న వారికి ఆయన కళ్లజోళ్లు అందజేశారు. ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీరాజు, వైస్ ఎంపీపీ నీలం, సర్పంచు రాణిరవి, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుకు విశేష స్పందన

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైద్య అధికారులు తెలిపారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రెండవ రోజు కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. 1వ డివిజన్‌లోని కేంద్రంలో 131 మంది, 19వ డివిజన్‌లో 147 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను, కంటి అద్దాలను పంపిణీ చేశారు.

కంటి వెలుగు కేంద్రాలను ఉపయోగించుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ బి.వెంకటేశ్వర రావు అన్నారు. అత్తాపూర్‌లోని కంటి వెలుగు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు అనుభవజ్ఞులైన డాక్టర్లు అందుబాటులో ఉంటారన్నారు. వీరి సేవలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రషీద్‌గూడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్



పరీక్షలు నిర్వహించుకున్న మహిళకు కంటి అద్దాలను అందించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



అత్తాపూర్‌లోని కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు